క్లుప్తంగా

భవన నిర్మాణం పూర్తి చేస్తాం..



సాక్షి ఎఫెక్ట్..

డోర్నకల్: స్థానిక సబ్ సెంటర్ భవనం పూర్తయ్యేలా చర్యలు చేపడతామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రమీలారావ్ తెలిపారు. స్థానిక శాంతినగర్‌లో పీహెచ్‌సీ సబ్‌సెంటర్ భవన నిర్మాణ పనులు నిలిచి రోడ్డు ప్రక్కన వైద్య సేవలు అందిస్తుండటంపై 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితం కావడంపై స్పందించిన డాక్టర్ ప్రమీలారావు బుధవారం సబ్‌సెంటర్ నిర్మాణ పనును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సబ్ సెంటర్ల కోసం నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులు త్వరగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట మండల వైద్యాధికారి డాక్టర్ సాధ్విజ ఉన్నారు.

విజయవంతం చేయాలి

మరిపెడ రూరల్: మహాజన నేత మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈనెల 26న వరంగల్ హంటర్ రోడ్డులో జరిగే ఉమ్మడి వరంగల్ మాదిగల ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శాగంటి రమేశ్‌మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం మరిపెడ మండలంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ గుగ్గిళ్ల నవీన్ కుమార్ మాదిగ అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా శాగంటి రమేష్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, పార్థు, అశోక్, కవి, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఐక్యంగా ఉద్యమించాలి

గూడూరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళితులంతా ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ మాల మహానాడు జిల్లా జనరల్ సెక్రటరీ బిజ్జం రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 25 వ తేదీన భద్రాచలం నుంచి డిసెంబర్ 1వరకు చేపట్టనున్న మాలల మహాపాద యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాములు, ఉపేందర్, శాంతివర్ధన్, కృష్ణ, ఉపేందర్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి ఆలయంలో కిసాన్ పరివార్ సంస్థ సీఈఓ డాక్టర్ వివేక్-పల్లవి దంపతులు బుధవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందజేస్తానని వివేక్ తెలిపారు. ఆయన వెంట శివవర్మ నాయక్, విష్ణునాయక్, వెంకన్న, రామ్మూర్తి, వెంకటేశ్వర్లు, బీమానాయక్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గూడూరు: మండలంలోని గాజులగట్టు శివారు పాటిమీదిగూడెంకు చెందిన అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేసే ఆయా పెనుక యాకమ్మ (45) బుధవారం అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెల్సుకున్న ఐసీడీఎస్ సీడీపీఓ, సూపర్ వైజర్ విజయకుమారి, అంగన్‌వాడీ టీచర్ల ద్వారా దహన సంస్కారాలకు రూ.10వేలు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంగమ్మ, తిరుపతమ్మ, రష్యాబేగం, స్వరూప, మంజుల, ఉమ పాల్గొన్నారు.

ముళ్ల కంపను తొలగించాలి

నెల్లికుదురు: చెరువు కట్టపై దారికి అడ్డంగా పెరిగిన ముళ్ల కంపను తొలగించాలని సీపీఎం గ్రామ కార్యదర్శి బానాల యాకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని నైనాల గ్రామంలోని ఊర చెరువు కట్టపై రైతులతో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కట్టకు ఇరువైపులా ముళ్ల కంపలు పెరగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బాబు గౌడ్, నర్సయ్య, వెంకన్న, రామస్వామి, పుల్లయ్య, సత్యనారాయణ, ఐలయ్య పాల్గొన్నారు.

రక్తదానం

నెహ్రూసెంటర్: హీరో ప్రభాస్ పుట్టిన రోజు పురస్కరించుకుని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆయన అభిమానులు 18 మంది రక్తదానం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధక్షుడు జినుక సైదులు, ఉపాధ్యక్షులు ప్రశాంత్, గుర్రాల చింటు, గౌతమ్, శేఖర్, మెట్టు నరేష్, షరీఫ్, చింటూ, మున్నా, తిరుపతి, సాయి, వెంకటేశ్ పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

చిన్నగూడూరు: తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ మండల కమిటీని ఎన్నుకున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లం ఎల్లయ్య తెలిపారు. మండల అధ్యక్షుడిగా ఆదిబాబు, ఉపాధ్యక్షుడిగా అర్జున్ రెడ్డి, కోశాధికారిగా ఉపేంద్రచారి, ప్రధాన కార్యదర్శిగా శ్రీను, మహిళా కన్వీనర్‌గా ఉపేంద్ర, సభ్యులను ఎన్నుకున్నారు.

చెత్తకు చెక్..!

- తొర్రూరు మున్సిపాలిటీలో బయో మైనింగ్‌కు సన్నాహాలు
- రూ.1.10కోట్లతో ఏర్పాటు చేసేందుకు నిర్ణయం
- వ్యర్థాల పునర్ వినియోగంతో ఏళ్లనాటి చెత్త సమస్యకు పరిష్కారం



హచ్చుతండా సమీపంలోని డంపింగ్ యార్డులో చెత్తను పారబోస్తున్న సిబ్బంది

తొర్రూరు: తొర్రూరు మున్సిపాలిటీలో చెత్త సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండలంలోని హచ్చు తండా సమీపంలోని డంపింగ్ యార్డులో గుట్టలుగా చేరుతున్న వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోంది. వ్యర్థాలు కాల్చడంతో అనారోగ్యం పాలవుతున్నామని కొద్ది కాలంగా తండావాసులు ఆందోళనలు చేపడుతున్నారు. తండా వాసుల ఆందోళనల తరుణంలో కొంతకాలం చెత్త పారబోత నిలిచిపోయింది. స్థానికుల ఆందోళనలు, ప్రజలు ఇబ్బందుల దృష్ట్యా బయో మైనింగ్ ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీని కోసం రూ.1.10కోట్లు వెచ్చించేందుకు సిద్ధమయ్యారు. ఈ ప్రక్రియను నిర్వహించేందుకు హైదరాబాద్‌కు చెందిన ఓ ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించారు. తొర్రూరు మండల శివారులోని హచ్చుతండా సమీపంలో 11ఎకరాల్లో బయో మైనింగ్ ప్రక్రియ నిర్వహించనున్నారు. ప్రస్తుతం అక్కడ డంపింగ్‌యార్డు కొనసాగుతోంది. 20 ఏళ్లగా పట్టణంలో కుటుంబాలు పెరగడంతో నిత్యం 8 టన్నుల చెత్త సేకరిస్తున్నారు.ఈ నేపథ్యంలో బయో మైనింగ్ విధానం మున్సిపాలిటీకి ఆదాయం చేకూర్చనుంది. వ్యర్థాల పునర్వియోగంతో ఏళ్లనాటి చెత్త సమస్యకు పరిష్కారం లభించనుంది.

ఇలా చేస్తారు..

- బయో మైనింగ్ ప్రక్రియలో భాగంగా ఇందులో చెత్తను ఒక చోట చేర్చి రసాయనాలు చల్లి వేరు చేసే యంత్రంలో వేస్తారు. కంపోస్టును ఒక వైపు, రాళ్లను మరోవైపు, ప్లాస్టిక్ వ్యర్థాలు ఇంకో వైపు పంపిస్తుంది.
- చెత్త నిల్వలను రెండు రకాలుగా పునర్వినియోగించనున్నారు. చీపుర్లు, రబ్బరు, చెప్పులు, కవర్లు తదితర వ్యర్థాలను సిమెంట్ ఫ్యాక్టరీకి సంబంధించిన ముడిసరుకుగా వినియోగిస్తారు.
- ఇతర వ్యర్థాలను 40రోజుల విధానంలో విడతల వారీగా వేరు చేసి సేంద్రీయ ఎరువు తయారు చేస్తారు. ఈ ఎరువును మున్సిపాలిటీ నిర్వహిస్తున్న హరితహారం మొక్కలతోపాటు అవసరం ఉన్న రైతులకు అందిస్తారు.
- ఈ ప్రక్రియ అనంతరం డంపుయార్డులోని భూమిని చదును చేసి శుభ్రంగా తీర్చిదిద్దుతారు.
- డంపు యార్డులోని ప్లాస్టిక్‌ను సైతం వేరు చేసి తరలిస్తారు.
- భవిష్యత్‌లో డంపు యార్డులో చెత్త నిల్వ సమస్యకు ఈప్రక్రియతో శాశ్వత పరిష్కారం చూపాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం.

త్వరలో అందుబాటులోకి..



కొంత కాలంగా పట్టణ వాసులు ఇబ్బంది పడుతున్న డంపింగ్‌యార్డు సమస్యకు బయో మైనింగ్‌తో పరిష్కారం లభించనుంది. దీనిద్వారా మంటలు, పొగ, దుర్వాసన బారినుంచి ప్రజలు విముక్తి కలుగుతుంది. ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించాం. త్వరలోనే ఈ ప్రక్రియ అందుబాటులోకి వస్తుంది.

– శాంతికుమార్, మున్సిపల్ కమిషనర్, తొర్రూరు

విద్యార్థుల జీవితాలతో చెలగాటం



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

మహబూబాబాద్: పెండింగ్ స్కాలర్ షిప్‌లను, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి మాగం లోకేష్, వెలుగు శ్రావణ్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 27లోపు విడుదల చేయకపోతే చలో ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించడంతోపాటు విద్యార్థులతో హైదరాబాద్ దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, వెంకటేష్, వికాస్, సాయి, ప్రకాశ్, అశోక్ పాల్గొన్నారు.

నర్సిరెడ్డిని మరోసారి గెలిపించాలి



మహబూబాబాద్ రూరల్: ప్రచారం చేస్తున్న హరినాయక్, తదితరులు

మహబూబాబాద్ రూరల్: టీఎస్ యూటీఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి గెలిపించుకుందామని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు బానోతు హరినాయక్ అన్నారు. ఎమ్మెల్సీగా టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డిని గెలిపించాలని కోరుతూ మండలంలోని పర్వతగిరి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం కరపత్రాలు, డోర్ స్టిక్కర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం నట్టి రవి, హెచ్ఎం లింగమూర్తి, ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, రవికుమార్, ఉమా పాల్గొన్నారు.

నెల్లికుదురు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సింహారెడ్డిని గెలిపించుకుందామని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. ఎమ్మెల్సీ ఓటు నమోదు, ప్రచార కార్యక్రమంలో భాగంగా మండలంలోని మునిగలవీడు ఉన్నత పాఠశాలలో బుధవారం కరపత్రాలు, డోర్ స్టిక్కర్లు ఆవిష్కరించారు. హెచ్ఎం స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

నెహ్రూసెంటర్: వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర 4వ మహా సభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు వర్రె బాలకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో సంఘ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 24, 25 తేదీలలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సభలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల సమస్యల పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో గౌరమ్మ, మాదాసు నరేష్, సరిత, సుధాకర్, వెంకటేష్, సారయ్య, నాగరాజు, యాకయ్య, ఎల్లయ్య, రాజు, బాలు, యాకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి



డోర్నకల్: మాట్లాడుతున్న శ్రీధర్

డోర్నకల్/మరిపెడ రూరల్/నెల్లికుదురు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న పీఆర్టీయూ అభ్యర్థి పింగళి శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని సంఘం జిల్లా కార్యదర్శి చాగర్లమూడి శ్రీధర్ కోరారు. బుధవారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వెంపటి సీతారాములు, బద్రినాథ్, రమేశ్, పవన్‌కుమార్, శ్రీనివాస్, మరిపెడ మండలం శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కీసర రమేశ్, లింగాల మహేష్‌గౌడ్, నెల్లికుదురు మండల అధ్యక్ష కార్యదర్శులు కొత్త నర్సింహారెడ్డి, గొట్టిముక్కల శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

దంతాలపల్లి: అర్హత కలిగిన ప్రతి ఉపాధ్యాయుడు ఎమ్మెల్సీ ఓటర్‌గా తప్పక నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంతోపాటు, దాట్ల, పెద్దముప్పారం గ్రామాలలో ఉన్నత పాఠశాలలలో బుధవారం ఓటింగ్ నమోదుపై అవగాహన కల్పించారు కార్యక్రమంలో హెచ్ఎంలు వేణుమాధవరెడ్డి, కృష్ణయ్య, పీఆర్‌టీయు మండల ప్రధాన కార్యదర్శి గొడిశాల రఘు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బీరవెల్లి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ



తొర్రూరు: సరుకులు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

తొర్రూరు: వృద్ధులను గౌరవించడంతోపాటు ఆదరించాలని బాలవికాస ప్రతినిధి పి.సుజాత అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో బుధవారం డివిజన్ కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వై.రమ, ఎం.రమ, శైలజ, శోభారాణి, సరిత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

దంతాలపల్లి: బాలవికాస ఆధ్వర్యంలో జనవికాస స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయం అని తహసీల్దారు కాటం చంద్ర రాజేశ్వర్ అన్నారు. బుధవారం అనాథ వృద్ధులకు నిత్యావసర వస్తువులు, చలికోట్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కందునూరి సుకన్య, మార్గం శోభ, స్వర్ణలత, స్వరూప పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్‌తో బీసీలకు అన్యాయం



సమావేశంలో పాల్గొన్న బీసీలు

గూడూరు: ఎలాంటి వివాదాలకు తావులేకుండా సమగ్ర కులగణన చేపట్టాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముంజాల రాజేందర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని గౌడ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెదకాసు కుమారస్వామి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీ విద్యార్థులకు భవిష్యత్తులో పెను ప్రమాదం ఉందన్నారు. జీఓ 29 ని పూర్తిగా బహిర్గతం చేయాలని, గ్రూప్–1 పరీక్షలు రాసిన విద్యార్థులకు న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. లేనిచో పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బీసీ కులాల ప్రజలు ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో రజక, ముదిరాజ్, కురుమ, నాయిబ్రాహ్మణ, యాదవ, గౌడ, మున్నూరుకాపు సంఘాల అధ్యక్షులు, బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు గండి వీరేందర్‌గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి కట్ల విష్ణుగౌడ్, ఉమ్మడి జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో పాము కలకలం



నర్సింహులపేట: మండలంలోని జయపురం శివారు దాసుతండా ప్రభుత్వ పాఠశాలలోని బీరువాలో పాము కలకలం సృష్టించింది. బుధవారం జయపురం శివారు దాసుతండా పీఎస్‌కు బుధవారం ఉదయం విధులకు వెళ్లిన హెచ్ఎం చిమ్ముల జయపాల్‌రెడ్డి పాఠశాలలోని బీరువాను తెరిచాడు. బీరువాలో ఉన్న పామును చూసిన హెచ్ఎం, అక్కడ ఉన్న విద్యార్థులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. హెచ్ఎం పిల్లలను బయిటికి పంపి తండావాసుల సహకారంతో అందులో ఉన్న కట్ల పామును చంపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కురవి: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన బుధవారం కురవి మండల కేంద్రం శివారు లింగ్యా తండా జీపీ పరిధిలోని మూడు గుడిసెల తండా వద్ద 365 జాతీయ రహదారిపై మలుపు వద్ద జరిగింది. సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామానికి చెందిన దారం శ్రీను అనే వ్యక్తి కొత్తూరు నుంచి మహబూబాబాద్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో లింగ్యా తండా సమీపంలోని జాతీయ రహదారి మలుపు వద్ద బైక్ అదుపు తప్పి కిందపడింది. దీంతో శ్రీను తలకు తీవ్రగాయమైంది. 108లో మానుకోటలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు.

ప్రజల రక్షణే పోలీసుల ధ్యేయం



తొర్రూరు: విద్యార్థులకు ఆయుధాలను చూపుతున్న సీఐ జగదీష్



కురవి: మాట్లాడుతున్న సీఐ సర్వయ్య



గూడూరులో..

తొర్రూరు: శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడుతున్న పోలీసులకు సమాజం అండగా నిలవాలని సీఐ జగదీష్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా డివిజన్ కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. తుపాకులు, ఆయుధాలు, పోలీసుస్టేషన్ పరిసరాలు, స్టేషన్ అధికారి, రైటర్, వైర్‌లెస్ తదితరాలపై ఆయా పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సైలు ఉపేందర్, రాంజీనాయక్, కానిస్టేబుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

కురవి: ప్రజలకు రక్షణ, భద్రత కల్పించడమే పోలీసుల లక్ష్యమని, పోలీసులకు సహకరించాలని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య అన్నారు. కురవి పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సైలు సదయ్య, వెంకన్న, సిబ్బంది శ్రీనివాస్, వెంకటయ్య, మాదవి పాల్గొన్నారు.

నెల్లికుదురు: చట్టాలపై విద్యార్థి దశనుంచే పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని ఎస్సై చిర్ర రమేష్ బాబు విద్యార్థులకు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు.

గూడూరు: మండల కేంద్రంలోని సర్కిల్ పోలీసు స్టేషన్‌లో బుధవారం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా స్థానిక అరవిందా విద్యాలయ విద్యార్థులకు పోలీసుల సేవలు, తుపాకులు వినియోగించాల్సిన తీరును ఎస్సై గిరిధర్‌రెడ్డి చూపించారు. సీఐ కె.బాబూరావు పోలీసు అమరవీరుల గురించి వివరించారు.

నర్సింహులపేట: నర్సింహులపేట పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఎస్సై మాలోతు సురేష్ ఓపెన్ హౌజ్ కార్యక్రమంలో నిర్వహించారు. **బయ్యారం:** బయ్యారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ బి.రవికుమార్ బుధవారం ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. బయ్యారం, గార్ల ఎస్సైలు తిరుపతి, జీనత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యుత్ ప్రమాదాలపై 'పొలంబాట'

నర్సింహులపేట: మండలంలోని గోపాతండాలో బుధవారం విద్యుత్ శాఖ అధ్వర్యంలో పొలంబాట కార్యక్రమంలో రైతులకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డీఈఈ మధుసూదన్ మాట్లాడారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

తొర్రూరు: మండలంలోని మడిపల్లి శివారు ఆకేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. 4ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆర్ఐ బషీర్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని ఎస్సై ఉపేందర్ పేర్కొన్నారు.

విద్యుత్ కోతలతో ఎండిపోతున్న పంటలు

బయ్యారం: మండలంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో అప్రకటిత విద్యుత్ కోతల ద్వారా వ్యవసాయ మోటార్లు నడవకపోవడంతో రైతుల పంటలు ఎండిపోతున్నాయని న్యూడెమోక్రసీ పార్టీ, ఏఐకేఎంఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు పార్టీ నాయకులు సబ్‌స్టేషన్‌లో ఏఈకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగేష్, భిక్షమయ్య, కృష్ణ, పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

పెద్దవంగర: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓ బుధారపు శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని కొరిపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. రిజిస్టర్లు పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

గూడూరు: ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలలను అమలు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు సంపత్‌రావు, నర్సింహానాయక్, రహీంపాష పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే లక్ష్యం



మహబూబాబాద్ రూరల్: కార్మికుల సంక్షేమం కోసం కొట్లాడే మజ్దూర్ యూనియన్‌ను గెలిపించాలని మజ్దూర్ యూనియన్ వరంగల్ బ్రాంచ్ సెక్రెటరీ యుగంధర్, డివిజనల్ సెక్రెటరీ రవీందర్ న్నారు.యూనియన్ ఆధ్వర్యంలో నెక్కొండ నుంచి మహబూబాబాద్ వరకు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డోర్నకల్ బ్రాంచ్ సెక్రెటరీ అంజియాదవ్, చైర్మన్ ముకుందం పాల్గొన్నారు.

నిలిచిన పనులు పూర్తి చేయాలి

కురవి: మండలంలోని మోద్గులగూడెం జెడ్పీ హైస్కూల్‌లో మన ఊరు– మనబడి కార్యక్రమంలో నిలిచిన పనులను వెంటనే పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ గంధసిరి జ్యోతిబసు డిమాండ్ చేశారు. బుధవారం పాఠశాలలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొలిపాక వీరేందర్, ప్రవీణ్, నరేందర్, నిఖిత పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

నెల్లికుదురు: ప్రభుత్వ పాఠశాలల్లోనే సకల సౌకర్యాలతో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని ఎంఈఓ రామదాసు అన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రభుత్వం అందించిన సెకండ్ పార్ట్ పాఠ్య పుస్తకాలను బుధవారం పంపిణీ చేశారు.

రైతులకు అందని పరిహారం

మహబూబాబాద్ రూరల్: అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ఇచ్చే విషయంలో తమకు అన్యాయం జరిగిందని మండలంలోని లక్ష్మీపురం(బి) రైతులు అంకని చంద్రయ్య, వల్లెపు వెంకన్న, ఎస్.కే.యాకుబ్, గుంజె రాజు అన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చే విషయంలో అవకతవకలకు పాల్పడిన ఏఈఓ పున్నమిపై చర్య తీసుకోవాలని కోరుతూ బుధవారం బాధిత రైతులు డిమాండ్ చేశారు.

27న యాదవుల 'సదర్'

మహబూబాబాద్ రూరల్: హైదరాబాదులో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈనెల 27న యాదవ కులస్థుల సదర్ జరుగనుందని టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ మేకల వీరన్నయాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం మేకల వీరన్నయాదవ్ మాట్లాడారు.

ఏఈఓలపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏఈఓలపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తేళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని ఆమనగల్ గ్రామంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో రైతులు సుధాకర్, వెంకటయ్య, మహేశ్, మధుకర్, వెంకన్న పాల్గొన్నారు.

నూతన కోర్టులు ఏర్పాటు చేయాలి

తొర్రూరు: తొర్రూరులో నూతన కోర్టులు ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్వకొలను ప్రవీణ్‌రాజు కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని హైకోర్టులో తెలంగాణ హైకోర్టు పోర్టుపోలియో జడ్జి సూరెపల్లి నందను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో రామకృష్ణ, వెంకన్న, పొదకంటి యాకాంబ్రం, ఐలోని, ప్రదీప్, నాగరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిన్నగూడూరు: మండల కేంద్రంలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ నవ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో వీధి దీపాలు అమర్చనున్నట్లు తెలిపారు. ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కేసముద్రం: మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలు, ధన్నసరి, కేసముద్రం పీఏసీఎస్ సెంటర్‌లను, ఉప్పరపల్లి గోదాంను ఏఓ వెంకన్న బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



గార్ల: బీజేపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి భూక్యా శ్రీనునాయక్ పిలుపునిచ్చారు. బుధవారం గార్లలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంను ఆయన లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. గ్రామగ్రామాన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఇల్లెందు నియోజకవర్గంలో పార్టీ సత్తాను చాటాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఆర్.విమల్‌కుమార్ జైన్, పార్టీ మండల అధ్యక్షుడు జంపాల వెంకన్న, దేవానాయక్, బుచ్చిబాబు, గణేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా

- తహసీల్దార్‌తో గొడవకు దిగిన ట్రాక్టర్ యజమాని
- పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

నెల్లికుదురు: మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామ శివారులోని ఆకేరు వాగులో బుధవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో రెవెన్యూ అధికారులతో కలిసి తహసీల్దార్ కోడిచింతల రాజు ఆకేరు వాగులోకి వెళ్లారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న బ్రాహ్మణకొత్తపల్లి గ్రామానికి చెందిన కొంపెల్లి శ్రీశైలం, జెల్ల యాకయ్య, నెల్లికుదురుకు చెందిన నరేందర్‌ల ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. దీంతో జెల్ల యాకయ్య తహసీల్దార్ రాజుతో గొడవకు దిగాడు. యాకయ్యపై తహసీల్దార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. యాకయ్యతోపాటు డ్రైవర్ సాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపారు.